క్లుప్తంగా

పండూరులో మొక్కల పంపిణీ

కాకినాడ రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండూరు గ్రామంలో శనివారం రాత్రి మునగమొక్కలు పంపిణీ చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) వెంకటలక్ష్మి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గ్రామ సచివాయం వద్ద మొక్కలు పంపిణీ చేపట్టారు. వారు మాట్లాడుతూ మునగ మొక్కలు పంపిణీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయని, మునగలో అనేక ఔషధ గుణాలు ఉన్నందున ప్రతి ఇంటా మొక్కలు పెంపకం చేపట్టాలని కోరారు.

ప్రజా సహకారంతోనే క్లీన్ సిటీ



పద్మనాభ నగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల తోడ్పాటు ఎంతో అవసరమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. శనివారం ఆయన 24వ డివిజన్ పద్మనాభనగర్‌లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విభజన తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలపై శ్లాబ్‌లు వేయడం వల్ల మురుగునీటి పారుదల అవరోధంగా ఉందన్నారు. డ్రైనేజీలలో సిల్ట్ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశాలు జారీ చేశారు.

వైభవంగా వేంకటేశ్వర రథోత్సవం



స్వామివారి రథోత్సవానికి పూజలు చేస్తున్న అర్చకులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా అర్చకుడు పెద్దింటి సీతారామం ఆధ్వర్యంలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు బాణసంచా కాల్పులు, మేళతాళాలతో రథంలో గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం మహాన్నదానం నిర్వహించారు. దేవదాయశాఖ ఈఓ పీఎస్‌వీ సూర్యనారాయణరాజు, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిఠాపురంలో కుంతీమాధవునికి..



భక్తజన సంద్రంలో కుంతీ మాధవుని రథం

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రం పిఠాపురంలో పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన కుంతీమాధవుని దివ్య రథోత్సవం శనివారం రాత్రి కనుల వైకుంఠంగా సాగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పేరున తొలి అర్చన చేసిన అర్చకులు అధిక సంఖ్యలో వచ్చిన భక్త జనసందోహం నడుమ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞీకంలో వేదమంత్రాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం రాత్రి విచిత్ర వేషాలు, తప్పెటగుళ్లు, బ్యాండుమేళాల నడుమ విద్యుద్దీపాలు పూలమాలలతో అలంకరించిన రథంపై పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో ఉత్సవ విగ్రహాలను వేద పండితులు అధిష్ఠించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ట్రస్టు బోర్డు చైర్మన్ వరదా శేషు రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగిన రథాన్ని అశేష భక్త జనవాహిని లాగగా స్వామి వారు ముందుకు సాగిపోయారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం వేళంగిలో శనివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచారు. పార్టీనాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు నాణ్యమైన విద్యుత్

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- నేమాం, తిమ్మాపురంలలో సబ్ స్టేషన్లకు శంకుస్థాపన



విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ గీత

కాకినాడ రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నవరత్నాలు – పేదల ఇళ్ల పథకం లబ్ధిదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నియోజవర్గంలో విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని నేమాం – 3, 4, తిమ్మాపురం లే అవుట్లలో కొత్తగా మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు శనివారం ఎంపీ వంగా గీతతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు శంకుస్థాపన చేశారు. నేమాంలో సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ వీరవెంకట సత్యనారాయణ అధ్యక్షన నిర్వహించిన ఆయా కార్యక్రమాలకు ఈపీ డీసీఎల్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఎస్‌ఈ పీవీఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. మూడు సబ్ స్టేషన్లు రూ.18.5 కోట్లతో నిర్మించనున్నారు. భూమి పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేమాం, తిమ్మాపురం లే అవుట్లలో పేదలకు వేలాదిగా పట్టాలు ఇచ్చామన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నందున లబ్ధిదారులకు కొత్త కనెక్షన్లను ఇచ్చేందుకు లోడ్ సరిపడే విధంగా కొత్త సబ్ స్టేషన్లు ఉపయోగపడతాయన్నారు. నియోజవర్గంలో నేమాం, తిమ్మాపురం లే అవుట్లతో పాటు తూరంగి, కరప గ్రామాలకు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. నేమాం, తిమ్మాపురంలో పనులను వేగవంతం చేయాలని ఆ శాఖ అధికారులను కోరారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్‌తో పాటు సర్వీసు వైరు ప్రభుత్వమే ఇస్తోందన్నారు. సబ్ స్టేషన్ల ద్వారా జగనన్న కాలనీల్లో మెరుగైన విద్యుత్ అందించేందుకు వీలవుతుందన్నారు. ఎలక్ట్రికల్ ఈఈ ప్రసాద్, ఏడీఈలు శ్రీనివాస్, రాంబాబు, ఏఈలు శ్రీనివాసరావు, ఆదినారాయణ, కన్‌స్ట్రక్షన్ ఏడీఓ ఉషారాణి, ఏఈ వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఈ విష్ణుమూర్తి

కరప: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు డివిజన్ డీఈఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులతో ఆయన సమావేశమై లో ఓల్టేజీ, విద్యుత్ తీగలు వేలాడడం, ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలపై మాట్లాడారు. గత రెండేళ్లలో మండల పరిధిలో 214 విద్యుత్ స్తంభాలు వేయడం జరిగిందని, లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి 30 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామ పరిధిలోని విద్యుత్ సమస్యలు చెప్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, పెంకే సత్తిబాబు, ఎంపీడీఓ కర్రె స్వప్న, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృదు స్వభావి వాణీ జయరాం

- గాయనితో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సత్కళావాహిని
- సంతాపం వ్యక్తం చేసిన సభ్యులు



సత్కళావాహిని వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయని వాణీ జయరామ్ (ఫైల్)

కాకినాడ కల్చరల్: ప్రముఖ గాయనీ వాణీ జయరామ్‌తో కాకినాడకు మంచి అనుబంధం ఉంది. 2014 జనవరిలో స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ 40 వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై వాగ్గేయ కారుల కీర్తనలు ఆలపించి అలరించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు, సంస్థ అధ్యక్షుడు గోపాల నర్సరాజు తదితరులు ఆమెను ఘనంగా సత్కరించారు. సత్కళావాహిని సంగీత, అధ్యాత్మిక సేవలను అభినందించినట్టు కృష్ణామాచార్యులు తెలిపారు. ఈమె చాలా మృదుస్వభావి అని అన్నారు. సంస్థ సభ్యులు ఈమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

కన్నుల పండువగా సీతారామ కల్యాణం



సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న సీతారామస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం పునర్వసు కావడంతో శనివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

- ఎమ్మెల్యే కురసాల, సంకురాత్రి చంద్రశేఖర్
- మెడికవర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- హాజరైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, గెటప్ శ్రీను
- ఉత్సాహంగా అవగాహన ర్యాలీ



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే పొన్నాడ, గెటప్ శ్రీను

కాకినాడ రూరల్: అప్రమత్తతతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందని పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేట జంక్షన్ వద్ద మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ నాగమల్లితోట జంక్షన్ నుంచి భానుగుడి వరకు ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, గెటప్ శ్రీనులతో కలసి ఎమ్మెల్యే కురసాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రిలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కాకినాడ రూరల్, ముమ్మిడివరం ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పొన్నాడ వెంకట సతీష్ కుమార్, బుల్లితెర నటుడు గెటప్ శ్రీను, సంకురాత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ నుంచి కోలుకున్నవారిని సత్కరించారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ సోకిందని వినగానే సగం చచ్చిపోతామని, వ్యాధి శరీరాన్ని కుంగదీసే భయాలు, అనుమానాలు, బెంగలు మనిషికి ఆందోళన కలిగిస్తాయని అన్నారు. ముఖ్యంగా రోగి కుటుంబ సభ్యులను సైతం మానసికంగా కుంగదీస్తుందన్నారు. ఈ వ్యాధిపై విజయం సాధించాలంటే మనో ధైర్యం అవసరమన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ సాధారణంగా కుటుంబంలో ఒకరి క్యాన్సర్ సోకిందని తెలియగానే భయపడతామని, అటువంటి భయాలను పక్కనపెట్టి వైద్యులను సంప్రదించి వారి సలహా మేరకు నడుచుకోవాలన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిరంతరం జరగాలన్నారు. మెడికోవర్ హాస్పటల్స్ ద్వారా కేన్సర్ బాధితుడికి అందిస్తున్న సేవలను సెంటర్ హెడ్ శివారెడ్డి వివరించి క్యాన్సర్‌ను జయించిన పేషెంట్లను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్లకు వరం కేంద్ర బడ్జెట్

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్ దేశ ప్రజలపై భారాలు మోపుతూ, కార్పొరేట్లకు వరాలు కురిపించేలా ఉందని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఆయా సంఘాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, తోకల ప్రసాద్, గదుల సాయిబాబు, తాళ్లూరి రాజులు మాట్లాడుతూ 40 కోట్ల మంది కార్మిక వర్గానికి అన్యాయం చేస్తూ కనీస వేతనాల ప్రస్తావనగాని, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, నూతన ఉపాధి కల్పన గురించి గానీ, మూసిన పరిశ్రమలు తెరిపించే ఆలోచనగానీ, మహిళల రక్షణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా దేశం ఏరకంగా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. రైల్వే మెయిన్‌లైన్ విస్మరించారని అన్నారు. ఈ నిరసనలో కేంద్ర సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పండూరులో గడప గడపకూ..



పండూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని పండూరులో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అమ్మఒడి, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ, ఆసరా, చేయూత, ఇళ్ల పట్టాలు, పలు సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నామన్నారు. పథకాలను ప్రజలకు వివరించి గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు రోడ్లు, డ్రైనేజీలతో పాటు, కుళాయిలు, వీధి దీపాలతో పాటు పలు సమస్యలను వెల్లడించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ ఉలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు నందిపాటి సత్తిబాబు, నందిపాటి అజయ్, ధర్మరాజు, ఆదినారాయణ, గరగ పెదకాపు, వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సత్తిబాబు, బావిశెట్టి వెంకటేశ్వరరావు, సానా వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మండల సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, జాన్ ప్రభాకర్, తోటకూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాల కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

మండలంలోని రమణయ్యపేట శేషాద్రినగర్‌లో బాల కనకదుర్గాదేవి ఆలయ 14వ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ లింగం రవి కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలతో కలశ పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు అమ్మవారికి ధాన్యాభిషేకం, హారతి సేవలో పాల్గొన్నారు. కొత్తపల్లి గిరీష్, కోమలి సత్యనారాయణ, కమిటీ సభ్యులు చోడిశెట్టి వీరశంకర రామారావు, గంటి ధర్మరాజు, ఆరిపాక సతీష్, కాకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాలమ్మతల్లి మూలవిరాట్‌కు విశేష పూజలు



బందోబస్తు ఏర్పాట్లపై జెడ్పీటీసీ, తదితరులతో చర్చిస్తున్న సీఐ శ్రీనివాస్

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా శనివారం అమ్మవారి మూలవిరాట్, ద్వారపాలకుల విగ్రహాలకు, కలశాలకు ధాన్యం, నవధాన్యాలతో విశేష పూజలు చేశారు. యాగశాలలో బ్రహ్మశ్రీ పి.సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో శైవాగమ పండితులతో 11 మంది దంపతులతో మండపార్చన, పంచశయ్యాధివాసం, మూర్తిన్యాసం, తత్తన్యాసం, అధివాస విజ్ఞాపన గర్తన్యాసం, రత్నంన్యాసం ఐదు హోమ కుండాలలో ఆవరణ హోమం తదితర పూజలు జరిపించారు. అనంతరం కలశ శిఖరంపై ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు దంపతులు పూజలు చేశారు.

బందోబస్తుకు పరిశీలన

అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా రానున్న రాజకీయ ప్రముఖులు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన బందోబస్తుకు ఏర్పాట్లు చేసినట్టు సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సాదే లోహిదాస్ కుమార్, మేడిశెట్టి సత్తిబాబు, నక్కా వీరభద్రరావు, నక్కా సత్తిబాబు తదితరులతో సీఐ చర్చించారు. పార్కింగ్, అన్నదానం, భక్తుల దర్శనం తదితర ప్రదేశాల్లో ఏమేర బందోబస్తు నిర్వహించాలని, ట్రాఫిక్ కంట్రోల్ తదితర అంశాలపై చర్చించారు.

గ్రంథాలయాలు భవితకు సోపానాలు

- ఎంపీ వంగా గీత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రంథాలయాలు భవితకు సోపానాలని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో కాకినాడ ప్రధాన గ్రంథాలయంలో శనివారం మనం-మన గ్రంథాలయం కార్యక్రమంలో ఆమె పాల్గొని సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠనంతో వచ్చే జ్ఞానం మరవలేనిదన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ దాదాపు దశాబ్ద కాలం తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.1.22 కోట్లతో పుస్తకాలు కనుగోలు చేశామన్నారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వ్యాక్యూమ్ క్లీనర్‌ను ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్ ప్రసాద్, గ్రంథాలయ ఉప అధికారి వెంకటరాము, ఉద్యోగులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలు

- ఏడీసీ నాగనరసింహారావు
- గృహ నిర్మాణ సామగ్రి నాణ్యత నిర్ధారణ కేంద్రం ప్రారంభం



గృహ నిర్మాణ పరికరాల నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: నియోజకవర్గ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన కొమరగిరి లే అవుట్‌ను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు శనివారం సందర్శించారు. గృహ నిర్మాణ, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, కార్పొరేషన్ అధికారులతో కలసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే గృహ నిర్మాణ సామగ్రి నాణ్యత పరీక్షా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటి నిర్మాణానికి వినియోగిస్తున్న ఇటుకలు, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యతను ఆయన పరిశీలించారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో చేపట్టే గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, నిర్మాణాలు పూర్తి నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో కొమరగిరి లే అవుట్ మరో టౌన్ షిప్‌గా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మౌలిక వసతులతో పాటు, సచివాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. స్థానికుల ఉపాధికి అవసరమైన పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ మేరకు లబ్ధిదారులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. గృహ నిర్మాణశాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ సంజయ్, విద్యుత్‌శాఖ ఏఈ ప్రమోద్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం



యాప్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: మహిళలు సైబర్ సెక్యూరిటీతో పాటు డిజిటల్ అక్షరాస్యతపై మరింత అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలలో శనివారం ఉమెన్ ఎంపవర్‌మెంట్, డిజిటల్ మోనిటరింగ్ సెల్ ఆధ్వర్యంలో వర్సిటీ అనుబంధ కళాశాలల మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు వర్చువల్ విధానంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ మహిళల్లో సైబర్ సెక్యురిటీపై అవగాహన పెంచాల్సిన అవశ్యకత నేటి కాలంలో ఎంతైనా ఉందని, ఇందులో భాగంగా వరల్డ్ ఆఫ్ ఉమెన్ సంస్థ మహిళా సాధికారితకు, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి తమ వంతు కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆ సంస్థ రూపొందించిన యాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుమలత, రెక్టార్ కేవీ రమణ, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కబడ్డీ రిఫరీగా మురళి



సామర్లకోట: స్థానిక కబడ్డీ క్రీడాకారుడు, జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బోగిళ్ల మురళీకుమార్ ఖేలో ఇండియా కబడ్డీకి రిఫరీగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కబడ్డీ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ శనివారం స్థానిక విలేకర్లకు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 10 తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఖేలో ఇండియా కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు సామర్లకోటకు చెందిన మురళీకుమార్ ఎంపిక కావడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, కోశాధికారి తాళ్లూరి వైకుంఠం, జిల్లా కోచ్ పోతుల సాయిప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

శాప్ లీగ్ హాకీ విజేత కాకినాడ

- రన్నర్స్‌గా వైఎస్సార్ కడప



శాప్ హాకీ పోటీల్లో విజేతగా నిలచిన కాకినాడ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో హాకీ టర్ఫ్ పిచ్ మైదానంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించిన శాప్ లీగ్ హాకీ పోటీల్లో కాకినాడ జట్టు విజేతగా నిలిచింది. అండర్-19 యూత్ చాంపియన్‌షిప్ పద్ధతిలో నిర్వహించిన పోటీలలో 12 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన మ్యాచ్‌లలో సెమీస్‌లో కాకినాడ జట్టు సత్యసాయి జట్టుపై 1-0 స్కోర్‌తో గెలిచి ఫైనల్స్‌కు చేరుకుంది. రెండో సెమీస్‌లో డాక్టర్ వైఎస్సార్ కడప జట్టు నెల్లూరు జట్టుపై 3-0 స్కోర్‌తో విజయం సాధించి ఫైనల్స్‌కు వచ్చింది. ఫైనల్స్‌లో కాకినాడ జట్టు డాక్టర్ వైఎస్సార్ జట్టుపై 1-0 స్కోర్‌తో గెలిచి కప్‌ను సొంతం చేసుకుంది. ద్వితీయస్థానంలో వైఎస్సార్ జట్టు, మూడో స్థానంలో సత్యసాయి వైఎస్సార్ జట్టు నిలిచాయి. శనివారం మైదానంలో జరిగిన బహుమతి ప్రదానంలో విజేతలకు డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్‌లు నాగేంద్ర, దీపక్ ఆకాశ్‌లు పాల్గొన్నారు.